క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



సోమలలో షాదీమహల్ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

సోమల: మండలంలో శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించనున్న 23 అభివృద్ధి పనులను బుధవారం ఎంపీపీ ఈశ్వరయ్య పరిశీలించారు. పనులను నాణ్యతాప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ఖాదర్‌బాషాకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజ, పీఆర్ ఏఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

పలమనేరు: పట్టణ సమీపంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు వచ్చే నెల 3న ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ మహమూద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ పాలిసెట్ రాసి సీటు రాని వారు, సెట్ రాయకుండా పదో తరగతి పాసైన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా అడ్మిషన్లకు హాజరు కావచ్చన్నారు. గతంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఖాళీ అయిన సీట్లలో చేర్చుకుంటున్నట్టు తెలియజేశారు. పూర్తి వివరాలను 94414837 42 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.

వేరుశనగ పంటపై అడవి పందుల దాడి



అడవి పందుల దాడిలో దెబ్బతిన్న వేరుశనగ పంట

పెద్దపంజాణి: మండలంలోని అటవీ సరిహద్దు గ్రామ పంచాయతీలైన పెద్దకాప్పల్లె, నాగిరెడ్డిపల్లె, వీరప్పల్లె, కోగిలేరు, కౌళత్తూరు, చలమంగళం, అమ్మరాజుపల్లె, బొమ్మరాజుపల్లె, రాయలపేటలో అడవి పందుల బెడద ఎక్కువైంది. వారం రోజులుగా వేరుశనగ పంటలపై దాడి చేసి నష్టం కలిగిస్తున్నాయని, రాత్రి సమయంలో గుంపులు గుంపులుగా వచ్చి కాయలను ముట్టెతో తవ్వి తినేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు స్పందించి అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓలు శ్రీరాములు, శివరత్నమ్మ

సోమల: మండలంలోని వల్లిగట్ల పంచాయతీ గల్లావారిపల్లె ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓలు శ్రీరాములు, శివరత్నమ్మ తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం కందూరు ఉన్నత పాఠశాలలో సీఆర్పీ శిక్షణకు హాజరై ఉపాధ్యాయులతో మాట్లాడారు.

కారు ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి



క్రిష్టప్ప (ఫైల్)

పెద్దపంజాణి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపిన వివరాలు..మండలంలోని లింగాపురానికి చెందిన క్రిష్టప్ప(56) ద్విచక్రవాహనంలో ఈ నెల 15న పుంగనూరు వైపు నుంచి స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. పలమనేరు నుంచి పుంగనూరుకు వెళుతున్న కారు మార్గమధ్యంలోని లింగాపురం సమీపంలో అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్రిష్టప్పను కుటుంబసభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పలమనేరు: మండలంలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు అన్ని పంచాయతీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ విద్యాసాగర్ బుధవారం తెలిపారు. నిర్దేశించిన తేదీల్లో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు 30న పెంగరగుంట, అక్టోబర్ 3న జరావారిపల్లె, 4న కల్లాడు, 5న కరిడిమొదుగు, 6న కూర్మాయి, 7న మండిపేట, 9న జగమర్ల, 10న సముద్రపల్లె, 11న టి.వడ్డూరు,12న మొరంలో వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

20 పైసలకే 'సాహో'



కుప్పంలో ఉన్న టమాట నారు



పుంగనూరు : మేలురకం టమాట నారు పంపిణీ చేస్తున్న హెచ్ఓ వరప్రసాద్

- కుప్పంలో టమాట నర్సరీ
- పలు రకాల కూరగాయల నారు కూడా లభ్యం

గంగవరం/పుంగనూరు: కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సిఓఈ)లో కేవలం 20 పైసలకే సాహో రకం టమాట నారును రైతుల కోసం తమ శాఖ ఆధ్వర్యంలో ఉంచినట్టు ఉద్యానశాఖ ఆఫీసర్ వరప్రసాద్ బుధవారం తెలిపారు. సుమారు మూడు లక్షల నారు రైతులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. 20 పైసలకే మంచి నాణ్యత గల సాహో నారు రైతులు తీసుకుని సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు పంట ఏపుగా పండి మంచి దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు నారు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. (సిఓఈ)లో టమాట నారు మాత్రమే కాకుండా వంగ, కాకర, బీర, సొర, అంటుకట్టిన వంగతో పాటు పలు రకాల కూరగాయల నారు సైతం లభిస్తుందన్నారు. పెద్దపంజాణి మండలం రాజుపల్లెకి చెందిన రైతు మంజునాథ్ రెడ్డికి టమాట నారు ఇవ్వడంతో తక్కువ ఖర్చుతో ఆయన పంట సాగు చేశారన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకుని కూరగాయల సాగుతో మంచి ఆదాయం పొందాలని కోరారు.

జాబ్‌మేళాలో 49మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో అధికారులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ బుధవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 49మంది ఉద్యోగాలను సాధించినట్టు ప్రిన్సిపల్ వెంకటేశులు తెలిపారు. జాబ్‌మేళాకు మొత్తం 118మంది హాజరుకాగా ఎంపికలో 49మంది ఎంపికకాబడ్డారు. పదో తరగతి పాస్/ఫెయిల్ నుంచి యూజీ దాకా చదివిన వారు మొత్తం 118మంది జాబ్‌మేళాకు హాజరయ్యారు. మూడు బహుళజాతి కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 49మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి నెలకు రూ.14,400 నుంచి రూ.30,200 దాకా జీతం ఉంటుందని వారు తెలిపారు.

5 నుంచి డాటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ప్రారంభం

డిగ్రీ కళాశాలలో అక్టోబర్ 5వ తేదీ నుంచి డాటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ప్రారంభవుతుందని, ఆసక్తి గల వారు ఇందులో చేరవచ్చునని వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి గోపి, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు చైతన్య, పవన్‌కుమార్, సిసింద్రి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఆర్మీ వింగ్



విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ రాజశేఖర్

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ ప్రారంభించామని, డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులను క్యాడెట్లుగా చేర్చుకుంటున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ బుధవారం తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదం చేస్తుందని చెప్పారు. అంతేకాకుండా ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో వెయిటేజ్ మార్కులు లభిస్తాయని, అలాగే సైన్యంలో చేరదలచిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్థులు తమ పూర్తి ధృవపత్రాలతో డాక్టర్ టి..శ్రీనివాసులును సంప్రదించి క్యాడెట్లుగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

బంగారుపాళెం: పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో సిబ్బంది వివరాలు, మండలంలో శాంతిభద్రతల పరిస్థితి గురించి సీఐ నాగరాజరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది విధినిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంభూపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

నివాసాల్లోకి కొండచిలువ



గుడిపాల: మండలంలో ఆరు అడుగుల కొండచిలువ ఇళ్ల మధ్యలోకి వచ్చేసింది. మండలంలోని 189కొత్తపల్లె ఎస్టీ కాలనీలో 10 కుటుంబాలు ఉన్నాయి. ఎస్టీ కాలనీకి సమీపంలో బుధవారం ఆరు అడుగులున్న కొండచిలువ కనిపించింది. అయితే ఆ పాము మేకపిల్లను తిన్నట్లు స్థానికులు గుర్తించారు. ఎటూ కదల్లేని స్థితిలో ఉండడంతో ఎస్టీ కాలనీ వాసులు ఆ పామును చంపేశారు.

నేడు బోయకొండకు ధర్మ ప్రచార రథం రాక

చౌడేపల్లె: కాణిపాకంలో స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి చెందిన ధర్మ ప్రచార రథం బోయకొండలో ఈనెల 28వ తేది గురువారం సాయంత్రం 6 నుంచి 29వ తేదీ ఉదయం 11.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని ఈఓ చంద్రమౌళి తెలిపారు. భక్తులు ప్రచార రథంలో ఉన్న స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందాలని కోరారు.

నేడు వాహనాల వేలం

పుంగనూరు: పట్టణంలోని ఎస్‌ఈబీ పోలీస్‌స్టేషన్‌లో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు వాహనాలు వేలం వేయనున్నట్టు బుధవారం సెబ్ సీఐ సీతారామిరెడ్డి విలేకరులకు తెలిపారు. వివిధ అక్రమ మద్యం రవాణా కేసుల్లో సీజ్ చేసిన 11 వాహనాలను వేలం వేస్తామని, ఆసక్తిగల వారు నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

పోలీస్ స్టేషన్‌లో 7 వాహనాలు..

పోలీస్‌స్టేషన్ ఆవరణలో 7 వాహనాలను గురువారం మధ్యాహ్నం 2గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ విలేకరులకు తెలిపారు. అక్రమ మద్యం రవాణా కేసుల్లో స్వాధీనం చేసుకున్న 6 మోటారుసైకిళ్లను, ఒక ఆటోను వేలం వేయనున్నట్లు తెలిపారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలో అక్రమ మద్యం రవాణా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను గురువారం వేలం వేయనున్నట్టు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు. 4 ద్విచక్ర వాహనాలు, ఒక కారును వేలం వేస్తామని, ఆసక్తి కలవారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

కమిషనర్‌ను కలిసిన పట్టు రైతులు



వినతిపత్రం ఇస్తున్న పట్టు రైతులు

పలమనేరు: జిల్లాకు చెందిన పలువురు పట్టు రైతులు పట్టు పరిశ్రమశాఖ కమిషనర్ శ్రీధర్‌ను బుధవారం గుంటూరులో కలిసి స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. పట్టు రైతులు శివన్న, చంద్రప్పగౌడు మాట్లాడారు. పట్టు రైతులకు బకాయిపడ్డ ఇన్‌సెంటివ్స్, గూళ్లు కట్టని పట్టుపురుగుల సమస్య, విషపూరితంగా మారిన ప్లాస్టిక్ చంద్రికలు మొదలైన వాటిని ఆయనకు నివేదించినట్టు చెప్పారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

బోరు కేబుల్ చోరీపై ఫిర్యాదు

రామకుప్పం: మండలంలోని రాజుపేట గ్రామ పొలాల్లో బోరు కేబుల్ వైర్లు చోరీ చేశారని రైతు ఆంజనేయులు బుధవారం రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన పొలంతోపాటు పక్కనున్న సుమారు 10 మంది రైతులకు చెందిన పొలాల్లో బోర్ కేబుల్ కట్ చేసి చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

గణనాథునికి సాంస్కృతిక నీరాజనం



నృత్యం చేస్తున్న కళాకారులు



అశ్వవాహనంపై ఊరేగుతున్న దేవ దేవేరులు



బ్రహ్మోత్సవ పాలకులను కంకణ విముక్తులుగా చేస్తున్న అర్చకుడు



వినాయకుని సేవలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో ఆలయ చైర్మన్ మోహన రెడ్డి, ఉభయదారులు చిన్నారెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలలో బుధవారం ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి కళాకారుల భరతనాట్యం, భక్తి గీతాలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. మంగళవారం అర్ధరాత్రి కల్యాణోత్సవం అనంతరం స్వామివారు అశ్వవాహనంపై పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

వినాయకుని సేవలో జెడ్పీ చైర్మన్ దంపతులు

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దంపతులు వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఉభయదారులు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్'లో అగ్రస్థానమే లక్ష్యం



స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కౌన్సిలర్ సాజిదాబేగం తదితరులు

పుంగనూరు: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో మున్సిపాలిటీని ప్రథమస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కౌన్సిలర్ సాజిదాబేగం కోరారు. బుధవారం స్థానిక రహమత్‌నగర్‌లో మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి, చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో విద్యార్థులు, వార్డు ప్రజలతో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ నిర్వహించారు. సాజిదాబేగం మాట్లాడుతూ, తడి చెత్త, పొడి చెత్త వేరుచేయడం, బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధం, చెత్త నుంచి సంపద తయారీ, మొక్కలు పెంచడం లాంటి కార్యక్రమాలను మున్సిపాలిటీలో పక్కాగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అందరూ సహకారం అందించి, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె కోరారు.

అంబేడ్కర్ విగ్రహానికి విద్యుత్ సొబగులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

పుంగనూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి రంగురంగుల విద్యుత్ దీపాలను మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏర్పాటు చేయించారు. బుధవారం ఆ విగ్రహం వద్ద దళిత నాయకులు అశోక్, శంకరప్ప, నరసింహులు, పెంచుపల్లి కృష్ణప్ప ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. అశోక్ మాట్లాడుతూ, అంబేడ్కర్ విగ్రహానికి నలుమూలలా లైటింగ్ ఏర్పాటు చేయడంతో ఈ ప్రదేశం ఆకర్షణీయంగా మారిందన్నారు. ఈ ప్రాంతాన్ని అంబేడ్కర్ సర్కిల్‌గా మార్పు చేయాలని కోరారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చిత్రపటాలు చేతబట్టి కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాస్కర్, రెడ్డి, మంజు, ఆంజప్ప, కుమార్, భానుప్రకాష్, రమణ, శ్రీనివాసులు, రామ్మూర్తి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఉలవలు పంపిణీ



ఉలవలను పంపిణీ చేస్తున్న బండకిందపల్లె ఆర్బీకే కన్వీనర్ హరికృష్ణారెడ్డి

రొంపిచెర్ల: ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటగా సాగు చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీపై ఉలవలను ఇస్తోందని బండకిందపల్లె రైతు భరోసా కేంద్రం కన్వీనర్ హరికృష్ణారెడ్డి అన్నారు. ఆయన బుధవారం ఆర్బీకేలో రైతులకు సబ్సిడీ ఉలవలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. కిలో ఉలవల ధర రూ.108 ఉండగా 80శాతం సబ్సిడీపై రూ.21.60లకే ఇస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం ఉలవ సాగుతో పొందవచ్చన్నారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌చార్జ్ నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు



అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

చౌడేపల్లె: మురుగునీటి కాలువల నిర్మాణాలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో రూ.60 లక్షలు మంజూరయ్యాయని, పనులు త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని ఎంపీపీ ఈశ్వరయ్య, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో వారు అభివృద్ధి పనులపై సమీక్షించారు. పనులను సకాలంలో పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని సూచించారు. వర్షాలు పుష్కలంగా కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని, అధికారులు పారిశుధ్యం మెరుగు పరచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు తాగునీటి బోర్ల నుంచి డైరెక్ట్ పంపింగ్ చేసి నీరు సరఫరా చేయాలన్నారు. అలాగే, ట్యాంకులను వారానికోసారి శుభ్రం చేయాలని ఆదేశించారు. పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు, సిమెంటు రోడ్లు, ఇంకనూ అవసరమైన పనులు ఉంటే తెలపాలని కోరారు. త్వరలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య సేవలు పొందేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నెక్కుంది సమీపంలోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజిబాబు, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, ఎంపీడీఓ సుధాకర్, తహసీల్దార్ మాధవరాజు, ఆలయ కమిటీ చైర్మన్ రామనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ అంజిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నేతలు మోహన్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

–మండల సమావేశంలో సభ్యుల డిమాండ్



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

గుడుపల్లె: ప్రజా సమస్యలనే త్వరితగతిన పరిష్కరించాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక శ్రీశక్తి భవనంలో మండల సాధారణ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. పలువురు సభ్యులు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పేదలకు ఇళ్ల మంజూరు కోసం అనుభవ ధ్రువపత్రాలను తహసీల్దార్ ఇవ్వాలన్నారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలన్నారు. గుడివంక ఆలయానికి ఉన్న భూములు దేవాలయం పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. శ్మశానాలకు దారి సౌకర్యం కల్పించాలన్నారు. ఆక్రమణలకు గురైన వాటికి సర్వే చేసి హద్దులు చూపి, ఆక్రమణల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. గ్రామాలకు మంజూరైన సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ భవనాలకు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు, యువలక్ష్మి, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, తహసీల్దార్ గుర్రప్ప, ఎస్ఐ లక్ష్మీకాంత్, ఈఓపీఆర్‌డి శంకర్, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: మండలంలో ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పనులు చేస్తూ మండలాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎంపీపీ యువరాజు తెలిపారు. బుధవారం మండలంలోని బైరుపల్లె పంచాయతీ మాదకుప్పం, బంగ్లా ఊరులో మురుగు నీటి కాలువ నిర్మాణ పనులు, సీసీరోడ్ల పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు ఇంద్రేష్, శంకర్‌రెడ్డి, మురళి, సచివాలయ కన్వీనర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



బొమ్మసముద్రంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అధ్యాపకులు

గుడిపాల: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఒప్పంద అధ్యాపకుల సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేసే బిల్లుకు అసెంబ్లీలో ఆమోదముద్ర వేయడంతో బుధవారం బొమ్మసముద్రం జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న అధ్యాపకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్స్ ఫెడరేషన్ బొమ్మసముద్రం యూనిట్‌కు సంబంధించి అధ్యాపకులు రెడ్డెప్పరెడ్డి, ఓబులేసు, జ్యోతిర్మయి, సెల్వీహేమతోపాటు పలువురు పాలాభిషేకం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ శరత్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి గొప్ప నిర్ణయం తీసుకుని అధ్యాపకుల నమ్మకాన్ని నిలబెట్టారన్నారు.